
సాక్షి
కామారెడ్డి
గురువారం ׀ 9 ׀ మే ׀ 2024



గాలివాన బీభత్సం

జిల్లాలోని పలు ప్రాంతాలలో బుధవారం వర్షం కురిసింది. గాలి బీభత్సాన్ని సృష్టించింది.

- IIలో ▸



కాంగ్రెస్‌తోనే న్యాయం

కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
44.7 /21.9

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాజ్‌నాథ్‌సింగ్ సభ రద్దు

బాన్సువాడ: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ గురువారం బాన్సువాడలో పాల్గొనాల్సిన సభ రద్దయ్యిందని బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్ తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం గురువారం బాన్సువాడలోని వీక్లీ మార్కెట్‌లో నిర్వహించే బహిరంగ సభలో రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొనాల్సి ఉంది. అయితే అనారోగ్య కారణాలతో ఆయన రావడం లేదని, దీంతో సభను రద్దు చేశారని పార్టీ నాయకులు తెలిపారు.

'ఆగండి.. కొంచెం ఆలోచించండి'



కామారెడ్డి అర్బన్: ఓటు వేసే ముందు ఓటర్లు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కామారెడ్డి సిటిజన్స్ అసోసియేషన్, మహిళా వేదిక, జలసాధన సమితి, కామారెడ్డి అధ్యయన వేదికల ప్రతినిధులు కోరారు. బుధవారం కామారెడ్డిలోని సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో 'ఆగండి.. కొంచెం ఆలోచించండి' పేరిట కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించే వారికే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సిటిజన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు జగన్నాథం, సీపీఐ నాయకుడు నర్సింహారెడ్డి, ఏపీటీఎఫ్ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు వేణుగోపాల్, టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రమణ, ఆయా సంస్థల ప్రతినిధులు శ్రీనివాస్, అంజయ్య, సంజీవరావు, శ్రీధర్, నరేందర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు

కామారెడ్డి క్రైం: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ శుక్రవారం వరకు పొడిగించిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 4,546 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడం కోసం మొదట ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు గడువు ఇచ్చారు. దీనిని మరో రెండు రోజులు పొడిగిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుందని కలెక్టర్ తెలిపారు. బుధవారం ఎన్నికల ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, పోలీస్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు.

'ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలి'



కామారెడ్డి క్రైం: అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ రైస్‌మిల్లర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో 29 మంది రా రైస్ మిల్లుల యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ట్యాబ్ ఎంట్రీని సజావుగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో మల్లికార్జున బాబు, జిల్లా పౌర సరఫరాల సంస్థ ఇన్‌చార్జి డీఎం నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

'భవనానికి మరమ్మతులు చేపట్టాలి'



కామారెడ్డి రూరల్: శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన గర్గుల్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ భవనం శిథిలావస్థలో ఉండడంతో మరమ్మతులు చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కేంద్రం సమీపంలో ఏపుగా పెరిగి, విద్యుత్ వైర్లను తాకేలా ఉన్న కొమ్మలను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళ, శిశు, వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి బావయ్య, పంచాయతీరాజ్ ఏఈఈ ఆదిత్యారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్ సురేఖ, అధికారులు పాల్గొన్నారు.

ఇందూరు అభివృద్ధి నా బాధ్యతే..



గాడిద గుడ్డును చూపిస్తున్న రేవంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి





నిజామాబాద్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న ప్రజలు

- జీవన్‌రెడ్డిని లక్ష మెజారిటీతో గెలిపించాలి
- ఎంపీ అర్వింద్ చేసింది గాడిద గుడ్డే..
- సిద్ధులగుట్ట సాక్షిగా ఆగస్టు 15లోగా రూ. 2లక్షల రుణమాఫీ చేస్తాం
- ఆర్మూర్, నిజామాబాద్ రోడ్ షోల్లో సీఎం రేవంత్‌రెడ్డి

ఖలీల్‌వాడి/ఆర్మూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని.. ఇందూరు ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో బీసీ కులగణనకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపుతున్నామన్నారు. వంద రోజుల్లో ఇన్ని పనులు చేస్తే.. కాంగ్రెస్ ఏం చేసిందంటూ కేసీఆర్ మాట్లాడుతున్నారన్నారు. బుధవారం ఆర్మూర్, నిజామాబాద్‌లలో నిర్వహించిన రోడ్ షోలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్నర్ మీటింగులలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఐదేళ్ల క్రితం మాజీ సీఎం కేసీఆర్ కూతురు వంద రోజుల్లో చక్కెర పరిశ్రమ తెరుస్తామని, ఎర్రజొన్న, పసుపు రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. దీంతో ఇక్కడి రైతులు ఎన్నికల్లో కవితకు గుణపాఠం చెప్పారన్నారు. బిడ్డ బెయిల్ కోసం నిజామాబాద్ ఆత్మగౌరవాన్ని కేసీఆర్ బీజేపీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని వ్యాఖ్యానించారు. పదేళ్లుగా మోదీ చెప్పిన అబద్ధాలను మళ్లీ చెబుతూ మోసం చేస్తున్నారని వాటిని నమ్మి మరోమారు మోసపోవద్దన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక నల్లచట్టాలు చేస్తే పంజాబ్, హర్యానా రైతులు ఢిల్లీ సరిహద్దులో ఉద్యమించి కేంద్రం మెడలు వంచారన్నారు. అదే పౌరుషాన్ని ఆర్మూర్ ప్రాంత రైతాంగం సైతం ప్రదర్శిస్తోందంటూ అభినందించారు. ఆర్మూర్ ప్రాంతంలో ఉన్న ఆదర్శ గ్రామం అంకాపూర్‌తో పాటు చైతన్యవంతమైన రైతులు ఇక్కడ ఉన్నారన్నారు. 2014, 2019లో బీఆర్ఎస్, బీజేపీలను గెలిపించి మోసపోయిన రైతులు కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఆర్మూర్ సిద్ధులగుట్ట సాక్షిగా ఆగస్టు 15లోగా రైతులకు రుణ మాఫీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ మరో పదేళ్లు అధికారంలో ఉంటుందని.. రైతులు పండించిన ప్రతి పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. పసుపు బోర్డు సాధించాలన్నా, చక్కెర కర్మాగారం తెరుచుకోవాలన్నా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలన్నారు. ఎన్నికల అనంతరం మంత్రులతో ఉపసంఘాన్ని వేసి రూ. 42 కోట్లు కేటాయించి చక్కెర కర్మాగారం ప్రారంభింపజేస్తామన్నారు. జీవన్‌రెడ్డి 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చలేని నేత అని తెలిపారు. నిజాయితీ గల రైతు బిడ్డకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.


ఆర్మూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల నాయకులు పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్ రెడ్డి పాల్గొనగా.. నిజామాబాద్‌లో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, మాజీ మేయర్ సంజయ్, నాయకులు తాహెర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరడుగుల అహంకారం అర్వింద్

ఆరు అడుగుల అహంకారానికి నిదర్శనం ఎంపీ అర్వింద్ అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఆయన ఐదేళ్లలో నిజామాబాద్ అభివృద్ధికి చేసింది గాడిద గుడ్డేనంటూ మండిపడ్డారు. నిజామాబాద్‌కు ఇంజినీరింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, పసుపు బోర్డు, స్మార్ట్ సిటీ, చక్కెర పరిశ్రమలు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చిన అర్వింద్.. ఐదేళ్ల పాటు పబ్బం గడుపుకున్నారని విమర్శించారు. ఎన్నికలు దగ్గరకు రాగానే పసుపు బోర్డు ఉత్తర్వులు తీసుకువచ్చారని.. కానీ ఎక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించలేదని పేర్కొన్నారు.

ప్రచారం ముమ్మరం

ఎన్నికల ప్రచారం కీలక దశకు చేరుకుంది. ప్రచారానికి మరో మూడు రోజుల సమయమే మిగిలి ఉండడంతో ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు జోరు పెంచారు. అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల అగ్రనేతలూ రంగంలోకి దిగుతున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కామారెడ్డిలో రోడ్‌షో నిర్వహించగా.. అల్లాదుర్గంలో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. శనివారం ఎల్లారెడ్డిలో నిర్వహించే సభలో ప్రియాంకగాంధీ పాల్గొననున్నారు.



- ఓట్ల వేటలో అభ్యర్థులు
- గడపగడపకు వెళ్తున్న నేతలు
- అగ్రనేతల సభలు నిర్వహిస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలు
- 11న కామారెడ్డిలో ప్రియాంక గాంధీ సభ

సాక్షి, కామారెడ్డి: పార్లమెంట్ ఎన్నికలు మూడు ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీల ముఖ్యనేతలు ఎన్నికల ప్రచార బాధ్యతలను తమ భుజాలపై మోస్తున్నారు. అభ్యర్థులు, ఆయా పార్టీల నేతలు సభలు, సమావేశాలు నిర్వహిస్తూనే గడపగడపకు వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి ఈనెల 11వ తేదీ సాయంత్రంతో తెరపడనుండడంతో నాయకులు ప్రచార జోరు మరింత పెంచారు. మిగిలిన మూడు రోజుల్లో ఎంత వీలైతే అంత ఎక్కువ మందిని కలిసి ఓట్లు అభ్యర్థించడానికి ఆయా పార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారు. కేడర్‌తోపాటు లీడర్లు ఇంటింటికీ వెళ్తున్నారు.

అభ్యర్థులకు మద్దతుగా నేతలు..

కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రచార బాధ్యతలను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చూస్తున్నారు. నియోజకవర్గంలో మెజారిటీ సాధించాలన్న తపనతో ఆయన విస్తృతంగా పర్యటిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి తరఫున స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తూ ప్రచారాన్ని నడిపిస్తున్నారు. డోర్ టు డోర్ క్యాంపెయిన్ విస్తృతంగా సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వచ్చిన ఓట్లకన్నా ఎక్కువ సాధించాలన్న లక్ష్యంతో ఆయన పావులు కదుపుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నియోజక వర్గంలో పర్యటిస్తూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరఫున మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నియోజకవర్గంలో మకాం వేసి ఊరూరా తిరుగుతున్నారు. ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను తమ వైపు తిప్పుతున్నారు. తనకు వచ్చిన మెజారిటీ కన్నా ఎక్కువ సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి తరఫున ఆ పార్టీకి చెందిన బాణాల లక్ష్మారెడ్డి, పైలా కృష్ణారెడ్డి, బాపురెడ్డి, మర్రి రాంరెడ్డి, తానాజీరావ్ తదితరులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి జిల్లా అంతటా తిరుగుతూ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం శ్రమిస్తున్నారు. ఆయన తనయులు పోచారం భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి సైతం విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక్కడ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి ఆ పార్టీ అభ్యర్థి తరఫున ప్రచార బాధ్యతలు మోస్తున్నారు. ఇతర పార్టీలకు చెందిన నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటూ పార్టీ బలం పెంచుతున్నారు. బీజేపీ అభ్యర్థి తరఫున మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ బీబీ పాటిల్ గెలుపుకోసం కృషి చేస్తున్నారు.

జుక్కల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఊరూరా తిరుగుతున్నారు. ఇతర పార్టీల నేతలను తమ పార్టీలోకి తీసుకుని బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి గెలుపుకోసం ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతారతోపాటు ఇటీవలే పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గంగారాం కూడా ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్నారు.

ముఖ్యనేతల రాక..

ప్రచార గడువు ముగింపునకు వస్తుండడంతో బహిరంగ సభలు, రోడ్‌షోలపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం కామారెడ్డిలో రోడ్‌షో నిర్వహించారు. కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించి శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. మెదక్ జిల్లాలోని అల్లాదుర్గంలో ఇటీవల నిర్వహించిన సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈనెల 11న కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. గురువారం బాన్సువాడలో నిర్వహించాల్సిన బీజేపీ సభలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొనాల్సి ఉంది. అయితే ఆయన అస్వస్థతకు గురి కావడంతో సభ రద్దయ్యింది.

'మరింత అప్రమత్తంగా ఉండాలి'

కామారెడ్డి క్రైం: ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి పోలింగ్‌కు ముందు 48 గంటల నిశ్శబ్ద కాలం(సైలెన్స్ పీరియడ్) అత్యంత కీలకమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఈ సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ విషయమై ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 13 న సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగుస్తుందని, అంతకు ముందు 48 గంటలనుంచి పోలింగ్ సమయం ముగిసే వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడాన్ని ఎన్నికల కమిషన్ నిషేధించిందని తెలిపారు. ప్రచార సమయం ముగిసిన వెంటనే ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు వెళ్లిపోవాలని సూచించారు. ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్లు, లాడ్జీలు, అతిథి గృహాలు తదితర ప్రాంతాలలో ఇతర నియోజకవర్గాలవారుంటే గుర్తించి పంపించివేయాలని అధికారులను ఆదేశించారు. సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఆబ్కారీ, వాణిజ్య పన్నులు, ఆదాయ పన్నుల శాఖల అధికారులు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు, వ్యయ నియంత్రణ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డబ్బు, మద్యం, కానుకలు లాంటివి అక్రమ రవాణా జరగకుండా ముమ్మరంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. సి-విజిల్, 1950 ద్వారా వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

జిల్లా రద్దు ఉత్త ముచ్చట

- ఉనికి కోల్పోయి తప్పుడు ప్రచారం చేస్తున్రు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై షబ్బీర్ అలీ ధ్వజం



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

సాక్షి, కామారెడ్డి: కొత్త జిల్లాల రద్దుపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. బుధవారం ఆయన కామారెడ్డిలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. కొత్త జిల్లాలను ఎందుకు రద్దు చేస్తుందని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయంతో బీఆర్ఎస్ ఉనికి కోల్పోతోందన్నారు. కేసీఆర్ సభలకు జనం రావడం లేదని, దీంతో చవకబారు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కామారెడ్డి జిల్లా ఎటూ పోదన్నారు. తాను బతికి ఉన్నన్ని రోజులు జిల్లాను ఎవరూ కదపలేరన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. పంద్రాగస్టులోగా రైతులకు సంబంధించిన రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామన్నారు. ప్రాణహిత-చేవెళ్ల పనులు పూర్తి చేయని కేసీఆర్ ఏం ముఖం పెట్టుకుని జిల్లాకు వచ్చాడని ప్రశ్నించారు. దేశంలో బీజేపీ పదేళ్ల పాలనలో తెలంగాణకు ఒరిగిందేమీ లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్
- నా హామీలకు మోదీ గ్యారంటీ పేరుతో సొంత మేనిఫెస్టో విడుదల



సొంత మేనిఫెస్టో విడుదల చేస్తున్న పాటిల్

బాన్సువాడ: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ పేర్కొన్నారు. తన హామీలకు మోదీ గ్యారంటీ అన్నారు. బుధవారం బాన్సువాడలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అరుణతార, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, జహీరాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ పెద్దోళ్ల గంగారెడ్డిల సమక్షంలో పాటిల్ తన సొంత మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా ఇప్పటివరకు విద్యా రంగానికి రూ.50 కోట్లు, జాతీయ రహదారుల నిర్మాణం, పునరుద్ధరణ కోసం రూ. 5,354.64 కోట్లు, ప్రజారోగ్య సంరక్షణ కోసం రూ. 3 కోట్లు, రైల్వే రంగంలో పురోగతికి రూ. 4,814.25 కోట్లు మంజూరు చేయించానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సొంత ప్రణాళికతో ముందుకు సాగుతున్నానన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు, యువత, దివ్యాంగులు, మహిళలకు స్వయం ఉపాధి కోసం రుణ సదుపాయం కల్పించడం, తాగునీటి సమస్య పరిష్కారం, ప్రాథమిక వైద్యం, కనీస విద్య తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. బీజేపీకి ఓటు వేసి తనను మరోసారి ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు.

సీఎంపై చర్యలు తీసుకోవాలి



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్‌లపై చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి, అద్దంకి దయాకర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు స్వార్థ రాజకీయాలు చేస్తూ హిందుత్వాన్ని అవమానిస్తున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, ప్రతినిధులు వెంకట స్వామి, వంగ ప్రసాద్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గట్టుమీది గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారం



బాన్సువాడ రూరల్: మండలంలో గట్టుమీది గ్రామాలైన కోనాపూర్, హన్మాజీపేట్, సంగోజీపేట్ గ్రామాల్లో బుధవారం రాత్రి బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ఎంపీలు గెలిస్తే అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కొట్లాడి నిధులు సాధిస్తారన్నారు. నాయకులు సంగ్రాం నాయక్, జెట్టి హన్మాండ్లు, సుధాకర్‌రెడ్డి, బండారి బాలయ్య, రాజేశ్వర్‌గౌడ్, రాసాలం సాయిలు, మారుతి, ఒడ్డె లక్ష్మణ్ పాల్గొన్నారు.

కామారెడ్డిలో చైర్‌పర్సన్..



కామారెడ్డి టౌన్: జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ బుధవారం పట్టణంలో ప్రచారం చేశారు. ప్రజా పాలన కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కౌన్సిలర్ పాత శివకృష్ణమూర్తి, నాయకులు బండారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ‘ప్రేరణ’కు ఎంపిక

నిజామాబాద్ అర్బన్: జిల్లాస్థాయిలో నిర్వహించిన ‘ప్రేరణ’ పోటీల్లో ప్రతిభకనబర్చి ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 10వ తేదీన జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో ‘ప్రేరణ’ పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న వర్నిలోని మల్లారెడ్డి మెమోరియల్ పాఠశాల పదో తరగతి విద్యార్థి శ్రీదీక్షిత్ (వర్ని), నవీపేట మండలం బినోల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని భవానీ ఉత్తమ ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. ఎంపికైన ఇద్దరు విద్యార్థులు జూన్ 1 నుంచి 10వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిర్వహించనున్న శిక్షణలో పాల్గొంటారని తెలిపారు.

‘అయోధ్య వైభవం’ పుస్తకావిష్కరణ



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని హరిచరణ్ మార్వాడీస్కూల్‌లో బుధవారం సంస్కార భారతి ఇందూరు ఆధ్వర్యంలో ‘అయోధ్య వైభవం’ పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సభాధ్యక్షుడు నరేందర్ భాయ్‌షా, గౌరవ అతిథులు గణపతి అశోక్ శర్మ, వక్త కృష్ణశాస్త్రి, విజయ భాస్కర్, ఇందూరు జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ చామకూర శ్రీనివాస్ రెడ్డి, రాజ్‌కుమార్ సుబేదార్, దస్తగిరి, గంట్యాల ప్రసాద్ పుస్తకావిష్కరణ చేశారు. అంతకుముందు జ్యోతిప్రజ్వలన చేశారు. భారతదేశ చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు, శ్రీరాముని రూపంలో అయోధ్య వైభవంగా జిల్లా కవులందరు కవితా సంకలనంగా తీసుకురావడం అభినందనీయమని కవి గణపతి అశోక్ శర్మ అన్నారు. కవులందరికి ప్రశంసా పత్రాలు, సన్మానాలు చేశారు. జిల్లా కవులు పాల్గొన్నారు.



దోమకొండలో రోడ్డుపై పడిన చెట్టు



చింతమాన్‌పల్లిలో ఇంటిపై కూలిన చెట్టు

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన చెట్లు
- తెగిపడిన విద్యుత్ తీగలు

దోమకొండ: దోమకొండ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా బలమైన బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. గంటపాటు గాలులు బలంగా వీయగా రోడ్లపై చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కల్లాల్లో ధాన్యం తడవగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం సైతం సాయంత్రం నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా లేదు. బుధవారం సైతం ఈదురుగాలులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అర్ధరాత్రి వరకు విద్యుత్ పునరుద్ధరించే పరిస్థితి లేదని విద్యుత్ అధికారులు తెలిపారు. ఇటు వర్షం, అటు కరెంట్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చింతమాన్‌పల్లి, ముత్యంపేట గ్రామాల్లో పలు ఇళ్లపై ఉన్న రేకులు లేచిపోయాయి. శివరాం మందిర్ ఏరియాలో రేకుల షెడ్డు ఎగిరిపడగా ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చింతమాన్‌పల్లిలో ఓ ఇంటిపై చెట్టు కూలింది.

తడిసిన ధాన్యం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. కామారెడ్డిలోని గాంధీగంజ్‌లో ధాన్యం కొట్టుకుపోయింది. ఈదురుగాలులకు ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు.

భిక్కనూరులో

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వడ్లు, మక్కలు ఆరబెట్టుకున్న రైతులు వర్షంతో ఆందోళన చెందుతున్నారు.



చింతమాన్‌పల్లిలో ఇంటిపై నుంచి ఎగిరిపోయిన రేకులు





కామారెడ్డి గంజ్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు, రామేశ్వర్‌పల్లిలో నేలకూలిన చెట్టు



దోమకొండలో ఎగిరిపడిన రేకులు

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం





కాస్లాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- పలు గ్రామాల్లో ప్రచారం

నిజాంసాగర్: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం జుక్కల్, మద్నూర్ మండలాల్లో ఆయన ప్రచారం చేశారు. ఉపాధి పనుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. వలసల నివారణ కోసం ఉపాధి హామీ పథకం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఉపాధి కూలి రూ.400 చేస్తామన్నారు. బోధన్ నుంచి జుక్కల్ మీదుగా బీదర్ వరకు రైల్వే లైను ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను గెలిపిస్తే జుక్కల్ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తారన్నారు. బిజినెస్‌ల కోసం పార్టీలు మారుతూ కోట్లకు పడగలు ఎత్తుతున్న బీబీ పాటిల్‌ను ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, అసెంబ్లీ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, రమేశ్‌దేశాయ్, అస్పత్‌వార్ వినోద్, సాయిలు పాల్గొన్నారు.

బిచ్కుందలో..

బిచ్కుంద: మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. గత పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీ చేసిందేమి లేదన్నారు. ఆగస్టు 15లోపు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తే రిజర్వేషన్లు తొలగిస్తారని ఆరోపించారు. బిచ్కుందలో ఆగిపోయిన సెంట్రల్ లైటింగ్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. పీసీసీ డెలిగేట్ విఠల్ రెడ్డి, గంగాధర్, షేక్ పాషా, నాషా నాయక్ పాల్గొన్నారు.

రాముడిని మొక్కాలి.. బీజేపీని తొక్కాలి

పెద్దకొడప్‌గల్: రాముడిని మొక్కాలి.. బీజేపీని తొక్కాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మండలంలోని చిన్నతక్కడ్, కాస్లాబాద్ గ్రామాల్లో ఆయన బుధవారం ప్రచారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఐదు గ్యారంటీలు అమలు చేశామన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. మహేందర్ రెడ్డి, నాగిరెడ్డి మోహన్, శామప్ప, మల్లప్ప పటేల్, సాయిబాబా, హన్మండ్లు, హైమద్, రషీద్ పాల్గొన్నారు.

పార్టీలో పలువురి చేరిక

నిజాంసాగర్/పిట్లం: జుక్కల్, మద్నూర్, పిట్లం మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కౌలాస్ మాజీ సర్పంచ్ హన్మండ్లుయాదవ్, ఎంపీటీసీ ఉమాకాంత్ పార్టీలో చేరారు. పిట్లం సాయి గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు హస్తం కండువా కప్పుకున్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం





ఎల్లారెడ్డిలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు, కామారెడ్డిలో అద్దంకి దయాకర్‌పై ఫిర్యాదు..

ఎల్లారెడ్డి: సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్ దిష్టిబొమ్మలను బుధవారం ఎల్లారెడ్డిలో బజరంగ్‌దళ్ నాయకులు దహనం చేశారు. హిందువుల మనోభావాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడాన్ని వారు ఖండించారు. నాయకులు వినోద్, నవీన్ తదితరులున్నారు.

అద్దంకి దయాకర్‌పై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: శ్రీరాముడు, సీత అమ్మవారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్‌పై చర్యలు తీసుకోవాలని హిందూ వాహిని ఆధ్వర్యంలో బుధవారం సీఐ చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నిర్మల్‌లో జరిగిన సభలో హిందువుల మనోభావాలని కించపరిచే విధంగా మాట్లాడారని మండిపడ్డారు. హిందువులు, దేవుళ్ల జోలికి వస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పత్తిపాక తరుణ్ గౌడ్, వంశీ, మహేందర్, గోపాల్, సాయియితేజ, కృష్ణ, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఖాళీ అవడం ఖాయం

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీకి జెండా మోసేవారు ఉండరని గతంలో కేసీఆర్, కేటీఆర్ అహంకారంగా మాట్లాడారని, కానీ ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్ముతున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో సైతం విజయంతో పట్టం కడతారని ఆయన అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని క్లాసిక్ గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో షబ్బీర్ అలీ సమక్షంలో మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావు, కామారెడ్డి వైస్ ఎంపీపీ ఉర్దొండ నరేష్, రాజంపేట జెడ్పీటీసీ హన్మండ్లుతో పాటు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. కేసీఆర్ పర్యటన తర్వాత కాంగ్రెస్‌లో భారీగా చేరికలు జరుగుతున్నాయని, బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితులో జనాలు లేరన్నారు. ప్రభుత్వాన్ని కూలగొడతామని కేసీఆర్, కేటీఆర్ రెచ్చగొట్టే ప్రసంగాలను చేయడంతో బీఆర్ఎస్ నాయకులను పార్టీలో చేర్చుకుంటున్నట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఖాళీ అవుతుందన్నారు. పంట నష్ట పరిహారం ఎన్నికలయ్యాక రైతులకు ఇస్తామని హామీ ఇచ్చారు. నరేంద్రమోదీ పేద, మధ్య తరగతి కుటుంబాలకు చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్‌ను ఆడిపోసుకోవడం తప్పా అభివృద్ధి కోసం ఎలాంటి హామీ ఇవ్వరని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులందరిని గెలిపించుకుని బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధి చెబుతామన్నారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ మాట్లాడుతూ.. బీబీ పాటిల్ పదేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. తన వ్యాపారాల మీద ఉన్న ప్రేమ ప్రజల సమస్యలపై లేదని విమర్శించారు.

భారీగా చేరికలు

మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావు, కామారెడ్డి వైస్ ఎంపీపీ ఉర్దొండ నరేష్, రాజంపేట జెడ్పీటీసీ హన్మండ్లు, మున్సిపల్ కౌన్సిలర్ రామోజు వనిత రామ్మోహన్, రేషన్ దుకాణాల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మిపతియాదవ్, మాచారెడ్డి మండలానికి చెందిన 22 మంది మాజీ సర్పంచ్‌లు, 18 మంది ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి షబ్బీర్ అలీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, చిత్రంలో ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్

పీఎఫ్ఐ, సిమికి మాతృసంస్థ కాంగ్రెస్

- బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: పీఎఫ్ఐ, సిమి ఆర్గనైజేషన్లకు కాంగ్రెస్ మాతృసంస్థగా మారుతోందని, ప్రపంచంలోని ఉగ్రవాద సంస్థలన్నీ ఆ పార్టీకి మద్దతు పలుకుతూ, ఫండింగ్ చేస్తున్నాయని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి ఆరోపించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిషేధిత సిమి సంస్థ కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతూ తీర్మానం చేసిన కాపీలను మైనార్టీ ఏరియాల్లో యువకులు పంచుతున్నారని తెలిపారు. ముస్లిములను ఓబీసీల్లో చేర్చి రిజర్వేషన్లు కల్పిస్తుందని, అందుకే కాంగ్రెస్‌కు ఓటేయాలని తీర్మానం చేశారన్నారు. కాంగ్రెస్ గెలిస్తే సిమి, ఉగ్రవాద సంస్థ కంట్రోల్‌లో ఉంటుందని ఆరోపించారు. బీజేపీకి 400 ఎంపీ సీట్లు ఇవ్వకుంటే రామమందిరానికి బాబ్రీ తాళం వేస్తారని మోదీ ప్రకటించారని గుర్తుచేశారు. పీఎఫ్ఐకి జగిత్యాల్, నకిలీ పాస్‌పోర్టులకు బోధన్ అడ్డాగా మారాయని, నిజామాబాద్‌లోని మైనార్టీ ఏరియాల్లో ఎన్ఐఏ పలుమార్లు దాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకుందన్నారు. సీఏఏ, యూనిఫామ్ సివిల్ కోడ్, ఎన్ఆర్సీ, ఆర్టికల్ 370పై కాంగ్రెస్ స్టాండ్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇవి హిందువుల ఉనికి కాపాడే ఎన్నికలని, ఇప్పటికైనా హిందూ సమాజం కళ్లు తెరవాలని కోరారు. అమలుసాధ్యం కాని హామీలు ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, నాయకులు గద్దె భూమన్న, న్యాలం రాజు, స్రవంతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, ఎర్రం సుధీర్, సుక్క మధు, మాస్టర్ శంకర్, బంటు రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

మాధవనగర్ వద్ద వాహనాల నిలిపివేత



నిజామాబాద్ రూరల్: మాధనగర్ రైల్వే గేటు వద్ద పోలీసులు బుధవారం రాత్రి బారికేడ్లు ఏర్పాటు చేసి నిజామాబాద్ వైపు నుంచి డిచ్‌పల్లి వైపు వాహనాలను అనుమతించలేదు. అదే సమయంలో వన్‌వే ద్వారా డిచ్‌పల్లి వైపు నుంచి వస్తున్న వాహనాలను జిల్లా కేంద్రం వైపు అనుమతించారు. మరికొన్ని వాహనాలు బైపాస్ మీదుగా నగరం వైపు వెళ్లాయి. నిజామాబాద్ వైపు నుంచి డిచ్‌పల్లి వై పు వెళ్తున్న వాహనాలు రాత్రి 9 నుంచి 10 గంటల వరకు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర అసహనానికిలోనై పోలీసులతో వాగ్వాదానికి దిగారు.



సింగితంలో పోస్టాఫీసు వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

ఆసరాకు నగదు కష్టాలు

నిజాంసాగర్: ఆసరా పింఛన్ డబ్బుల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారు. ఆసరా పింఛన్ల పంపిణీ మొదలు కావడంతో లబ్ధిదారులు పోస్టాఫీసులు, పంచాయతీ కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. బుధవారం మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం గ్రామ పోస్టాఫీసు వద్ద లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించారు. పింఛన్ ఇవ్వడానికి నగదు అందుబాటులో లేకపోవడంతో సబ్ పోస్టుమాస్టర్లు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.దీంతో లబ్ధిదారులు ఎండలో నిరీక్షిస్తున్నారు.



నిజాంసాగర్‌లో..

క్రైం కార్నర్

పరిస్థితి విషమించి వృద్ధుడి మృతి

మాక్లూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అడవిమామిడిపల్లికి చెందిన తెడ్డు పోశన్న(70) బోర్గాం (కే)లో తాత్కాలికంగా నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత నెల 30వ తేదీన ఉదయం మానిక్‌బండార్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా ఆర్మూర్ వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో పోశన్న తలకు బలమైన గాయం కావడంతో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు తెడ్డు నడ్పి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై గంగాధర్ తెలిపారు.

21 కేసులు కొట్టివేత

బోధన్‌టౌన్(బోధన్): ఎడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడి బజార్‌లో షెడ్డులను అక్రమంగా తొలగించారని వేసిన 21 కేసులను బోధన్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కొట్టివేస్తూ బుధవారం తీర్పును వెల్లడించారు. ఏజీపీ మోహన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. 2019–20లో ఎడపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడిబజార్‌లో 20 మంది అక్రమంగా షెడ్డులు వేయగా, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించారు. దీంతో షెడ్డులు వేసినవారు కోర్టును ఆశ్రయించారు. సాక్ష్యాధారాలు రుజువుకాకపోవడంతో న్యాయమూర్తి కేసులు కొట్టివేశారు.

మైనర్ల ఆచూకీ గుర్తింపు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్లు ప్రేమ పేరుతో 14 రోజుల క్రితం బయటికి వెళ్లిపోగా.. వారి ఆచూకీని గుర్తించినట్లు ఎస్సై గంగాధర్ బుధవారం తెలిపారు. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు. మైనర్లు మెట్‌పల్లిలో ఉన్నట్లు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గుర్తించామన్నారు. బాలికను జిల్లాకేంద్రంలోని సఖీ సెంటర్‌కు, బాలుడిని బాయ్స్ అబ్జర్వేషన్ కేంద్రానికి అప్పగించామని తెలిపారు.

ఊరూరా ఉపాధి జాతర

- వ్యవసాయ పనులు లేకపోవడంతో పెరిగిన కూలీల సంఖ్య
- కూలి పెంపుతో ప్రయోజనం



లింగాయిపల్లిలో చెరువు పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

కామారెడ్డి రూరల్: జిల్లాలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. గత నెలలో పనులకు కూలీలు తక్కువగా రాగా, మే ప్రారంభం నుంచి వారి సంఖ్య పెరుగుతోంది. కూలీల సంఖ్య పెరిగితేనే అభివృద్ధి పనులు జరుగుతాయని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నారు. కామారెడ్డి మండలంలో మొత్తం 6,859 మంది కూలీలుండగా వీరిలో 4,483 మంది పనిచేసే కూలీలున్నారు. రోజుకు సుమారుగా 3,500 మంది పనులకు హాజరవుతున్నారు. గతంలో రోజు కూలి రూ.272 ఉండగా వేసవి నేపథ్యంలో రూ.28 కలిపి మొత్తం రూ.300 చెల్లిస్తున్నారు.

చెరువుల్లో పూడికతీత

కామారెడ్డి మండలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువుల పూడికతీత పనులు చేపడుతున్నారు. అదేవిధంగా ఇస్రోజీవాడి గ్రామాల్లో ఫీడర్ చానెల్స్ పనులు, గూడెంలో ఊటకుంట పూడికతీత పనులు నడుస్తున్నాయి. క్యాసంపల్లి, రాఘవపూర్, లింగాయిపల్లి గ్రామాల్లోత ఫిష్‌పాండ్ పనులు, చిన్నమల్లారెడ్డి, గర్గుల్‌లో ఫార్మేషన్ రోడ్డు పనులు చేపడుతున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ కూలీలు పెద్ద సంఖ్యలో హాజరవుతుండటంతో పనులు జరిగే ప్రాంతాలు జాతరను తలపిస్తున్నాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పని ప్రదేశాల్లో నీడ, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. కూలీలకు వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు.

పెరిగిన క్యూబిక్ మీటర్ రేటు

ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరం నుంచి కొలతల రేట్లను పెంచింది. క్యూబిక్ మీటరు రేటు పెంచడంతో కూలీలకు రోజువారీ కూలి గిట్టుబాటవుతోంది. గతంలో పూడికతీత పనుల్లో క్యూబిక్ మీటరుకు రూ.176 ఉండగా ప్రస్తుతం రూ.195 పెంచారు. పాంపాండ్ క్యూబిక్ మీటరుకు రూ.274 ఉంటే రూ.333, ఫీడర్ చానెల్ పనులకు రూ.170 నుంచి రూ.195 పెంచారు.

“ కూలీలందరికీ పని కల్పిస్తాం



గ్రామాల్లో అడిగిన కూలీలందరికీ పనులు కల్పిస్తున్నాం. పది రోజుల నుంచి కూలీల సంఖ్య పెరుగుతోంది. మండలంలో ప్రతిరోజూ సుమారుగా 3,500 మంది పనులకు హాజరవుతున్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో ఉదయం పూటే పనులు నడుస్తున్నాయి.

– నాగవర్ధన్, ఎంపీడీవో, కామారెడ్డి మండలం